జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజా జ్యోతి
ప్రతిఅక్షరం - ప్రజల కొసం
ఖమ్మం
బుధవారం 26-6-2024
పేజీలు :8



## కేఎంసీ కమిషనర్‌గా అభిషేక్ బాధ్యతల స్వీకరణ

రఘునాథపాలెం, జూన్ 25: ఖమ్మం నగర పాలక సంస్థ (కేఎంసీ) కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలి ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఆదర్శ్ సురభి.. వనపర్తి కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో ఖాళీగా ఉన్న కేఎంసీ స్థానంలో మల్కాజ్‌గిరి అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అభిషేక్ అగస్త్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన మంగళవారం ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన కమిషనర్‌ను అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, వసుంధర, నగరపాలక సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు.



# అన్నదాతకు అండగా..

యాదాద్రి: అన్నదాతల అభ్యున్నతికి ప్రభుత్వాలు వివిధ పథకాలను అమలు చేస్తున్నాయి. సేద్యానికి ఉచిత విద్యుత్, ఏటా ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం, రుణమాఫీ, రైతు బీమా ఇచ్చి అండగా నిలుస్తోంది. అయితే రైతులకు వినూత్న వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, పంట మార్పిడిపై అవగాహన కల్పించి వారి ఆలోచనా విధానంలో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో రైతు వేదికల ద్వారా రైతులకు చేరువయ్యేలా ప్రభుత్వం నిర్ణయించింది.

రైతులంతా ఒక చోట చేరి సాగుబడి గురించి చర్చించేందుకు గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. అయితే ఈ వేదికల్లో ఆశించిన స్థాయిలో సమావేశాలు జరగలేదు. వీటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. రైతు వేదికల ద్వారా వ్యవసాయశాఖ అధికారులు ప్రతీ వారం రైతులకు పంటల దిగుబడితో పాటు సస్యరక్షణ, ఎరువుల వాడకం, తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 421 గ్రామపంచాయతీలను 92 క్లస్టర్లుగా విభజించి గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. ఈ వేదికల నిర్మాణానికి ప్రభుత్వం రూ.22లక్షలు వ్యయం చేసింది. వీటిని ప్రస్తుతం వ్యవసాయ విస్తరణాధికారులు కార్యాలయాలుగా వినియోగిస్తున్నారు. సీజన్లలో రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ సమావేశాల్లో రైతులంతా పాల్గొనడంలేదు. ఈ నేపథ్యంలో రైతులందరికీ అందుబాటులో ఉండేలా ఒక క్లస్టర్‌లో ప్రతీ మంగళవారం సమావేశాలు, వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. అందుకు జిల్లాలో మొత్తం 17 క్లస్టర్లను ఎంపిక చేశారు. ఈ క్లస్టర్ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, ఏవోలు, ఏఈవోలు, రాష్ట్ర కార్యాలయం నుంచి వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారు.

### 17 క్లస్టర్లలో సమావేశాలు

యాదాద్రి జిల్లాలో మొత్తం 421 గ్రామపంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. వీటిలో రెండు మూడు గ్రామాలను కలిపి ఒక క్లస్టర్‌గా విభజించి రైతు వేదికలను నిర్మించారు. అయితే ప్రతీ వారం రైతులతో జిల్లా యంత్రాంగం ఎంపిక చేసిన క్లస్టర్‌లో సమావేశాలు నిర్వహించనుంది. జిల్లాలో మొత్తం 17 క్లస్టర్లలో వీడియోకాన్ఫరెన్స్‌లు, సమావేశాలు నిర్వహించేందుకు వ్యవసాయశాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు జిల్లా వారీగా రైతులకు అనుకూలంగా ఉండేలా క్లస్టర్ల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలోని బీబీనగర్‌లోని రాయరావుపేట క్లస్టర్, బొమ్మలరామారం మండలంలోని మల్యాల, చౌటుప్పల్ మండలంలోని జైకేసారం, నారాయణపూర్ మండలంలోని నారాయణపూర్, ఆలేరు మండలంలోని కొలనుపాక, రామన్నపేట మండలంలోని రామన్నపేట, మోటకొండూరు మండలంలోని చాడ, ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు, భువనగిరి మండలంలోని అనాజీపూర్, అడ్డగూడూరు మండలంలోని అడ్డగూడూరు, పోచంపల్లి మండలంలోని భీమనపల్లి, మోత్కూరు మండలంలోని పాటిమట్ల, యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట క్లస్టర్ పరిధిలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులతో సమావేశాలు నిర్వహించనున్నారు.

ప్రభుత్వం రైతులకు పంటల సాగుపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. రైతుకు రైతు వేదికల్లో ప్రతీ మంగళవారం వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహిస్తాం. విత్తనాలు ఎరువుల వాడకం, పంట మార్పిడిపై అవగాహన కల్పిస్తాం. జిల్లాలో 17 క్లస్టర్లలోని రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ సమావేశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

# గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం..

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

కొణిజర్ల, జూన్ 25 : బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఇండియా కూటమి ఆధ్వర్యంలో అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. పదేళ్లుగా అడ్డగోలు పాలన చేసిన ప్రధాని మోదీ మొన్నటి ఎన్నికల్లో చతికిలపడ్డారని, ఆయన ఆటలు ఇక సాగనివ్వమని అన్నారు. మంగళవారం చిన్నగోపతి గ్రామంలో లింగాల భూషణంనగర్‌లో రెండు రోజులపాటు జరిగే రాజకీయ శిక్షణా తరగతులకు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్ హాజరయ్యారు. అనంతరం అమరుల స్థూపాల వద్ద పార్టీ జెండాలను ఎగురవేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం, పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులు బలపడుతున్నారని అన్నారు. అగ్రరాజ్యం అని చెప్పుకుంటూ సామ్రాజ్యవాద విధానాలు అవలంబిస్తున్న అమెరికా నేడు చైనా అభివృద్ధిని చూసి భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా నీట్ పరీక్ష పేపర్లు లీక్ చేసిందని, వెంటనే పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం 'మతోన్మాదం' అనే అంశంపై సోషల్ మీడియా రాష్ట్ర బాధ్యుడు మిట్టల రవి మాట్లాడారు. శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్‌గా మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు వ్యవహరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, మండల కమిటీ బాధ్యులు డాక్టర్ బోయినపల్లి శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకయ్య, అన్నారపు వెంకటేశ్వర్లు, చింతపల్లి ప్రసాద్, లింగాల దానయ్య, బుర్రి గోపయ్య, మోత్కూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



# సేవాలాల్ సేన మండల కమిటీ ఎన్నిక

**ఏన్కూర్-జూన్ 25, ప్రజాజ్యోతి :** సేవాలాల్ సేన మండల కమిటీ ఎన్నికలు మంగళవారం సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్ బానోత్ శ్రీకాంత్ అధ్యక్షతన స్థానిక వ్యవసాయ మార్కెట్ నందు జరిగింది. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ బానోత్ కిషన్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జి ఓ నెంబర్ 33, జీవో నెంబర్ 3 పరిరక్షణ కోసం జరిగే పోరాటంలో భాగంగా ది 9-9-2024 చలో హైదరాబాద్ రాష్ట్ర సదస్సుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా జులై మొదటి వారంలో ఖమ్మం జిల్లా లో జరిగే సదస్సుకు జిల్లాలోని అన్ని మండలాలకు సంబంధించిన విద్యార్థి, కార్మిక, కర్షక, మహిళా, సంఘాలు నూతన కమిటీలను ప్రకటించుకోవాలన్నారు. అందులో భాగంగా ఏన్కూర్ మండల నూతన కమిటీనీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా కోర్రి బాలాజీ, యువజన అధ్యక్షులుగా ధరావత్ రాజేందర్ నాయక్, రైతు సంఘం అధ్యక్షులుగా ధరావత్ శ్రీను నాయక్, సేవాలాల్ సేన సోషల్ మీడియా అధ్యక్షులుగా



బాణోత్ గోపీకృష్ణ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన విద్యార్థి సంఘం కన్వీనర్ చందు నాయక్, వైరా డివిజన్ కన్వీనర్ బానోతు బిచ్చు నాయక్, జిల్లా కో కన్వీనర్ లు నెహ్రూ నాయక్, ధరావత్ రామ్మూర్తి నాయక్, గూగులోత్ రాజ్ కుమార్ నాయక్, ముఖ్య భద్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 25 ప్రజాజ్యోతి:**




రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు పి మహేష్ కోరారు. ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని న్యూడెమోక్రసీ పార్టీ ఆఫీసులో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా విద్యారంగం మీద దృష్టి పెట్టకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటివరకు కనీసం విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం తీవ్రమైన నిర్లక్ష్యం అన్నారు. దీంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోమవారం నాడు కులానికి ఒక గురుకులాన్ని ఏర్పాటు చేస్తానని ప్రకటించారని ఇది సరైన కాదని అన్ని కులాలకు కలిపి రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా కామన్ విద్యా విధానాన్ని పెంపొందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వేరువేరు కులాలకు పాఠశాలలను సపరేట్గా ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు సమానత్వ భావన రాదన్నారు. ఇప్పటికే గత ప్రభుత్వం ఏర్పరిచిన గురుకులాలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని కనీసం మౌలిక సదుపాయాలు లేక కూనరిల్లుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్స్, వాచ్మెన్స్ లేరన్నారు. టీచర్ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ కాకపోవడం వల్ల పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. పెండింగ్ లో ఉన్న 8500 కోట్ల ఫీజియం బర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచి హాస్టల్స్ కు పక్కాభవనాలు నిర్మించాలన్నారు. ఖమ్మం జిల్లాకు ప్రత్యేకమైన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, పాలేరు జేఎన్టీయూ కాలేజీని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ క్రాంతి, జి మస్తాన్, సాగర్, రామకృష్ణ శ్రీకాంత్, సంపత్, కిరణ్, ఉమేష్, గోపి, భాను పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత




**ఖమ్మం టౌన్, జూన్ 25 ప్రజాజ్యోతి:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో మంగళవారం లయన్స్ క్లబ్ భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా గవర్నరు సిహెచ్ శివ ప్రసాద్ చేతుల మీదుగా లయన్ సభ్యుల ఆర్థిక సహకారంతో మహ్మదాపురం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థికి హాస్టల్ ఖర్చుల నిమిత్తం రు 10000/-, కొణిజర్ల గ్రామ పంచాయతీకి రు.80000/- లు విలువ గల ఫ్రీజరు( శవాలను భద్రపరచు బాక్సు ) కొణిజర్ల గ్రామానికి చెందిన భర్త లేని నిరుపేదరాలైన కళావతికి 9500/- లు విలువ గల కుట్టు మిషన్, పల్లిపాడు సర్కిల్ లోని అంగన్ వాడి స్కూల్ పిల్లలకి రు 10000/- లు విలువగల బౌల్స్ మరియు స్పూన్స్ లయన్ సభ్యుల సహకారంతో అందించడమైనది. ఈ సందర్భంగా జిల్లా గవర్నరు శివప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయుట చాలా ఆనందంగా ఉంది అని అన్నారు. ప్రెసిడెంటు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఇంకా రాబోవు రోజులలో ఇటువంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపినారు. ఈ కార్యక్రమములో రీజినల్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్, అధ్యక్షులు కార్యదర్శి వేముల హనుమంతరావు, కోశాధికారి జనార్ధన్ రావు, జోన్ చైర్మన్ డాక్టరు డి.సి.సి. రావు, కాకర్ల మల్లిఖార్జున్, పాయల నాగేశ్వరరావు, కె. విశ్వేశ్వరావు మరియు లయన్ సభ్యులు కమర్తపు కిరణ్, అత్తులూరి గోవర్ధన్, అబ్దుల్ అలీం, వంగవీటి నవీన్ మరియు యంపిడివో రోజారమణి, సెక్రటరీ రాజేశ్వరి మరియు ప్రజాప్రతినిధులు సూరంపల్లి రామారావు,మాజీ జడ్పిటిసి దొండపాటి రమేష్ , రవి, పోగుల శ్రీను, పాసంగి శ్రీను , సిడిపివో ఉషారాణి, సూపర్వైజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ భూముల సర్వేను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 ప్రజాజ్యోతి:** జిల్లాలో గత సంవత్సరంలో పంటలు వేయని భూములకు సంబంధించి, ప్రస్తుత పరిస్థితులు తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ అప్లికేషన్ యాప్ ద్వారా క్షేత్ర స్థాయి సర్వే ను మంగళవారం నుండి ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల తో కలిసి, కూసుమంచి మండల కేంద్రం, కూసుమంచి క్లస్టర్ లో చేపడుతున్న సర్వే ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ భూముల సర్వే ను వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ, గ్రామీణాభివృద్ది సంస్థ కు చెందిన అధికారులచే చేపట్టి , ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని అన్నారు. జిల్లాలో ఎంపిక చేయబడిన సర్వే నెంబర్లతో ఇట్టి సర్వే ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయ్ చందర్, కూసుమంచి మండల వ్యవసాయ అధికారిణి వాణి, అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.


# వ్యవసాయ భూముల సర్వేను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 ప్రజాజ్యోతి:**



జిల్లాలో గత సంవత్సరంలో పంటలు వేయని భూములకు సంబంధించి, ప్రస్తుత పరిస్థితులు తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ అప్లికేషన్ యాప్ ద్వారా క్షేత్ర స్థాయి సర్వే ను మంగళవారం నుండి ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల తో కలిసి, కూసుమంచి మండల కేంద్రం, కూసుమంచి క్లస్టర్ లో చేపడుతున్న సర్వే ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ భూముల సర్వే ను వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ, గ్రామీణాభివృద్ది సంస్థ కు చెందిన అధికారులచే చేపట్టి , ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని అన్నారు. జిల్లాలో ఎంపిక చేయబడిన సర్వే నెంబర్లతో ఇట్టి సర్వే ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయ్ చందర్, కూసుమంచి మండల వ్యవసాయ అధికారిణి వాణి, అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

# బీటెక్ ఫలితాలలో సాయిస్ఫూర్తి విద్యార్థుల హవా

**సత్తుపల్లి జూన్25 ప్రజా జ్యోతి. ఆర్. సి.:** జె ఎన్ టి యు హైదరాబాద్ బీటెక్ నాలుగో సంవత్సరం ప్రకటించిన ఫలితాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సత్తుపల్లిలో గల సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఈ ఈ విభాగం నుండి దుర్గాప్రసాద్ 9.3, బర్మావత్ ప్రకాష్ 9.1 మెకానికల్ విభాగం నుండి మహిసాక్షి వినోద్8.1, పోతురాజు నరేంద్ర 7.9 ఈ సి ఈ విభాగం నుండి కోడుమూరి నీరజ్ 9.4, ఆరేపల్లి త్రివేణి 9.3, అడపా నవ్య మాధురి 8.7, అవిరినేని సుష్మ 8.5 ,సి ఎస్ ఎం విభాగం నుండి నాళ్ళ అమ్రుష్ 9.1, క్షత్రియ భారతి 8.7 మంచి జి పి ఏ లతో ఫలితాలు సాధించినందుకు హెటెరో అధినేత, రాజ్యసభ సభ్యులు, సాయిస్ఫూర్తి కళాశాల చైర్మన్ బండి పార్ధసారధి రెడ్డి, ఉపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ శ్రీమతి బండి అన్విద, కళాశాల కరస్పాండెంట్ %ఢ% సెక్రటరీ దాసరి ప్రభాకర్ రెడ్డి, డైరెక్టర్ విజయ్ కుమార్ వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులను అభినందించారు.

## క్రమశిక్షణ పట్టదలతో విద్యానభ్యసించాలి డీఈవో సోమశేఖర శర్మ



**చింతకాని, జూన్ 25, ప్రజాజ్యోతి :** మండలంలోని పందిలపల్లి ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టుదలతో విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. 9, 10 తరగతుల విద్యార్థులను బోధనకు సంబంధించి అంశాలను అడిగి తెలుసుకున్నారు. బోధన పాఠ్యాంశాల పట్టణ క్రమశిక్షణ తదితర అంశాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులు ఇచ్చిన సమాధానాలతో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ పట్టుదలతో విద్యను అభ్యసించాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను శ్రద్ధతో విని పట్టు సాధించాలని అప్పుడే ప్రతిభావంతులు అవుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామా మోహన్ పాల్గొన్నారు.

## స్పాట్ అడ్మిషన్ ను సద్వినియోగం చేసుకోండి

**ఆదర్శ కళాశాల ప్రిన్సిపల్ అక్తర్**



**కారేపల్లి,జూన్ 25,ప్రజాజ్యోతి:** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లో గల ఆదర్శ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ గురువారం ఉదయం 9:30 నిమిషాలకు నిర్వహించబడునని ప్రిన్సిపల్ ఎండి అక్తర్ మంగళవారం ఒక ప్రకటనలో తేలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఏర్పడిన ఖాళీలకు గాను (ఎంపీసీ ,బైపిసి,సీఈసీ,ఎంఇసి) స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశాలు కల్పించబడతాయని ప్రిన్సిపల్ అన్నారు.కళాశాలలో అడ్మిషన్ పొందదలచిన విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో కళాశాల ఆఫీస్ లో సంప్రదించాలని ఈ సీట్ల కేటాయింపు పదవ తరగతిలో పొందిన జిపిఏ మార్కుల ప్రాతిపదికన భర్తీ చేయబడునని ఆయన తెలిపారు.

# రైతన్న శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- భూ నిర్వాసితుల రైతులకు పరిహారం జమ ... రాష్ట్ర మంత్రులకు హర్షం వ్యక్తం చేసిన రైతులు
- మంత్రుల చిత్రపటాలకు పూలు పాలాభిషేకం చేసిన రైతులు.



**సత్తుపల్లి జూన్25 ప్రజా జ్యోతి:** ఆర్. సి మండల పరిధిలోని యాతాలకుంట గ్రామానికి చెందిన 100 మంది రైతుల భూములు సీతారామ ప్రాజెక్టులో కోల్పోవటం వలన ఎన్నో సంవత్సరాలుగా అధికారులు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడంతో కేవలం 7 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం రైతులందరూ స్థానిక ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బట్టి విక్రమార్కుల, దృష్టికి తీసుకెళ్లడంతోనే గడువు పెట్టి అదే సమయానికి 100 మంది రైతులకు 10 కోట్ల పరిహారం రైతులకు అందడంతో మంగళవారం రైతులందరూ మంత్రులకు ,ఎమ్మెల్యేకు పూలు పాలాభిషేకం ఘనంగా నిర్వహించి, మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో తిరిగి తిరిగి ఇబ్బంది పడ్డామని కాంగ్రెస్ ప్రభుత్వంలో చెప్పిన 75 రోజుల్లో పరిహారం అందించడం ఆనందంగా ఉందన్నారు. రైతు రాజుగా ఉండాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో చల్లగుళ్ళ నరసింహారావు, గాదె చెన్నారావు, నరుకుళ్ళ అప్పారావు, నరేందర్, తాటి మోహన్ రావు, వెచ్చ రాంప్రసాద్, తమ్మిన రవి, పల్లె రామకృష్ణ, బట్టు మధుసూదన్ రెడ్డి, తురస భానుచందర్, సవలం ప్రభాకర్, ఉడతనేని అప్పారావు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి నగదు బహుమతి అందజేసిన భాగం ఫౌండేషన్



**బోనకల్,జూన్ 25,ప్రజాజ్యోతి:** పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి మంగళవారం భాగం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. మండల పరిధిలోని చిరునోముల గ్రామానికి చెందిన వేమా అరవింద్, చిరునోముల ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ, 2023-24 విద్యా సంవత్సరానికి గానూ జిల్లా పరిషత్ పాఠశాలల 10వ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మండలంలో ప్రథమ ర్యాంకు సాధించాడు. అతని ప్రతిభను ప్రోత్సహిస్తూ భాగం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తహసిల్దార్ పున్నం చందర్ ,ఫౌండేషన్ నిర్వాహకులు భాగం రాధాకృష్ణ చేతుల మీదుగా విద్యార్థికి రూ 5వేల ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ క్రమశిక్షణ సంకల్ప బలంతో విద్యార్థులు సులభంగా లక్ష్యాన్ని చేదించవచ్చన్నారు. విద్యార్థికి అభినందనలు తెలిపారు.చదువులలో రాణిస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహాన్నిస్తున్న భాగం సేవ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు ,వారి సేవా నిరతికి. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న భాగం రాకేష్ కి అభినందనలు తెలిపారు. చదువులలో రాణిస్తున్న విద్యార్థులను, సామాజికపరమైన సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి పలు స్వచ్ఛంద సేవా సంస్థలు మరింత ముందుకు రావాలని కోరారు.

# గ్రామ పంచాయతీ వర్కర్ల పెండింగ్ వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి




**కల్లూరు జూన్ 25(ప్రజా జ్యోతి):** మండలంలో ఉన్న గ్రామ పంచాయతీ వర్కర్లందరూ కలిసి పెండింగ్ వేతనాలు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంపీడీవోకి వినతిపత్రం అందించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతూ ఇల్లు గడవక అవస్థలు పడుతుంటే మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు ఒక్కొక్కరికి 6 నుంచి 7 నెలల వేతనాలు రాక మానసిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.బడులు ప్రారంభం కావడంతో పిల్లల ఫీజులు యూనిఫార్మ్ పుస్తకాలు కొనాలంటే డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్నామని ఎంపీడీవోకి వివరించడం జరిగింది.ఇకనైనా పై అధికారులు మాపై దయచూపి ప్రతినెల జీతాలు అందేలా చూడాలని,అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించి మా కుటుంబాలను ఆదుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాగంటి రాజశేఖర్,జె మల్లయ్య,రమేష్ శేషగిరిరావు,అన్ని గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొనడం జరిగింది.

# ధరణిలో సమస్యలు వెంటనే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 ప్రజాజ్యోతి:** ధరణి లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కూసుమంచి మండల తహసీల్దార్ కార్యాలయం సందర్శించి, ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్ణీత గడువులోగా ధరణికి సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలని అన్నారు. అన్ని మాడ్యుల్స్ లో దాఖలైన ధరణి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. అధికారులను ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఎన్ని పరిష్కరించారు, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయని ఆరా తీశారు. పెండింగ్ ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను అవసరమైన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే పరిష్కరించాలని అన్నారు. ఈ సందర్భంగా కూసుమంచి మండల తహసీల్దార్ సురేష్, అధికారులు, సిబ్బంది,

# ఎమ్మార్పీఎస్ కవాత్‌ను జయప్రదం చేద్దాం

**ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యులు ఏపూరి**




**కల్లూరు జూన్ 25(ప్రజా జ్యోతి):** మాదిగల ఆత్మగౌరవం,అభ్యున్నతి కోసం ఎస్సీ ఉప కులాల వర్గీకరణ లక్ష్యంగా ఏర్పడిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం జూలై 7 నాటికి మూడు దశబ్దాలు పూర్తి చేసుకోబోతున్నందున ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జులై 7న వరంగల్ జిల్లాలోని లక్షలాదిమంది మాదిగలతో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను ప్రత్యేకమైన డ్రస్ కోడ్ తో కవాత్ నిర్వహించడం జరుగుతుందని ప్రతి గ్రామం నుండి మండలాల వారిగా వరంగల్ లో జరగబోయే కవాతు కార్యక్రమాన్నికి లక్షలాది మాదిగలు పాల్గొని విజయవంతం చేయాలని మంగళవారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ ఆవరణం నందు ఎమ్మార్పీఎస్,ఎమ్ ఎస్ ఎఫ్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యులు ఏపూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని నూతన కమిటీలను ఏర్పాటు చేసి మండల కేంద్రంలోని జూలై 1న కవాత్ నిర్వహించి, ఎమ్మార్పీఎస్ జెండా ఎగరవేయాలని కోరారు. 30 సంవత్సరాల మాదిగల ఆత్మ గౌరవానికి కవాత్ ప్రతీకగా నిలవాలని సూచించారు. కవాతుకు ప్రత్యేకమైన డ్రస్ కోడ్ తెల్ల చొక్కా,నల్ల ప్యాంటు ధరించాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీ వర్గీకరణకు జూలై నెలలో పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ,బీసీ ల కులగణన జరపకుండా ఎటువంటి ఉద్యోగాలు భర్తీ చేయరాదని, కుల గణన పూర్తి చేసిన తర్వాతే నియమకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి దారెల్లి వెంకటేశ్వర్లు,కంచపోగు సురేష్, బొల్లెపోగు కృష్ణ,నెంబర్ వెంకటి,రాయల సుందరం, ఖమ్మం పాటి వెంకటేశ్వర్లు, ఇనపనూరి వెంకటి,రావూరి సీతారాములు,కిన్నెర యాకోబు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగానికి సబ్సిడీ ద్వారా ఎరువులు అందించాలి

**తిరుమలాయపాలెం, జూన్ 25, ప్రజా జ్యోతి :** నకిలీ విత్తనాలను అరికట్టాలని అదేవిధంగా రైతంగానికి సబ్సిడీ ద్వారా ఎరువులు అందించాలని, రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ రెండు లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అఖిలభారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం మండలంలో తాసిల్దార్ కి వినతిపత్రం ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ రైతన్నకి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని పంట రుణాలను మాఫీ చేయాలనీ, రైతులకు బ్యాంకుల ద్వారా కొత్త రుణాలు ఇవ్వాలని అదేవిధంగా విత్తనాలు అనేకం కుళ్ళిపోయాయని తక్షణమే నకిలీ విత్తనాలను అరికట్టి వారిపై చర్యలు తీసుకోవాలని వారు అన్నారు ఎరువులను సొసైటీల ద్వారా గ్రామాలలో సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి సబ్సిడీ ద్వారా ఎరువులను (పిండి కట్టలు) అందించాలని వారు డిమాండ్ చేశారు. వానాకాలం రైతుబంధు రైతుల ఖాతాలో ఇంతవరకు జమ కాలేదని తక్షణమే రైతులకు రైతుబంధు ఖాతాలో వేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా సహాయ కార్యదర్శి పోలేపొంగు నాగయ్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, ఐ ఎఫ్ టు యు జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, మాల్సూర్, నాగయ్య, వెంకన్న తదితరుల పాల్గొన్నారు.

# మేడం మా తప్పును క్షమించండి




**వైరా, జూన్ 25 ( ప్రజా జ్యోతి ):** ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం దిద్దుపూడి గ్రామంలోని సర్వే నెంబర్ 23/బి లో గల భూమి పై వైరా సబ్ రిజిస్టర్ కు ఫిర్యాదు చేయటం తమ తప్పేనని మక్కళ్ల వెంకటమ్మ,మక్కళ్ల రమణమ్మ చల్లా కేశమ్మ,చల్లా తిరుపతమ్మ మక్కళ్ల లక్ష్మి ఐదుగురు కలిసి వైరా రిజిస్టర్ కు ఓర్సు వెంకటేశ్వర్లు ఓర్సు రాము ఓర్సు శ్రీను పై ఇచ్చిన ఫిర్యాదు వాస్తవం కాదని ఒప్పుకొని క్షమించమని సబ్ రిజిస్టార్ ని కోరారు. అబ్బూరి నాగమ్మ దగ్గర నుండి ఓర్సు వెంకటేశ్వర్లు కొన్నది వాస్తవమని 25 సంవత్సరాల నుండి సాగులో ఉన్న భూమిని గ్రామస్తులు అందరూ కోరగా గుడి నిర్మాణానికి ఇచ్చినది నిజమేనని తెలిపారు. మా గ్రామానికి చెందిన కొమ్ము సామేలు అనే వ్యక్తి మాకు చదువు లేదని ఏమి తెలియదని మాకు భూమి ఆశ చూపించి ఓర్సు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులపై తనకున్న కక్ష సాధింపుతో మాకు వేరే వాళ్ళ పేర్లు చెప్పి మాతోనే వారిపై ఫిర్యాదు ఇప్పించడానికి కారకుడు కొమ్ము సామేలు అని తెలిపారు. వైరా సీఐ స్టేషన్ కి పిలిచి అడిగే వరకు ఓర్సు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులపై మేము కేసు పెట్టాము అన్న సంగతి మాకు తెలియదు తమ తప్పును క్షమించగలరని కోరారు.



# రైతు భరోసా పథకం అమలుకు పటిష్ట కార్యాచరణ: మంత్రి తుమ్మల

**రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 ప్రజాజ్యోతి:** రైతు భరోసా పథక అమలుకు పటిష్ట కార్యాచరణ చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి, కోదండ రెడ్డి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని రైతులతో వీడియో కాన్ఫరెన్సీ ద్వారా రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించి, రైతు భరోసా పథకం పై వ్యవసాయ మంత్రి అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతుల నుండి అభిప్రాయ సేకరణను క్రోడీకరించి, రైతు భరోసా పై కార్యాచరణ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా సంచాలకులు డా. మల్లారెడ్డి ప్రస్తుత వానాకాలం నందు వివిధ దశలలో ఉన్న పంటలకు సంబంధించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయ్ చందర్, రైతులు కూసుమంచి రైతు వేదిక నుండి పాల్గొనగా, జిల్లాలో రఘునాధపాలెం మండలం వి. వెంకటాయపాలెం, కొనిజర్ల మండలం తనికెళ్ళ, కల్లూరు మండలం కొర్లగూడెం, బోనకల్, కూసుమంచి రైతువేదికల నుండి పెద్ద సంఖ్యలో రైతులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్ తో మోడి ప్రభుత్వం ఆటలు సరికాదు

**యువజనుల సమస్యలపై డివైఎఫ్ఐ కమిటీ సర్వే**

**జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్**



**మధిర జూన్ 25 ప్రజా జ్యోతి :** మోడీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటం సరికాదని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం(మునగాల )గ్రామంలో యువజన సమస్యలపై డివైఎఫ్ఐ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సర్వే చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా యువజన ఎదురకొన్ని సమస్యలపై డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సర్వే జరుగుతుందని గ్రామీణ ప్రాంతంలో యువత పది ఇంటర్ డిగ్రీ పిజి పిహెచ్డీలు చేసి ఉపాధి లేక యువత ఎక్కువ శాతం నష్టపోతున్నారని గ్రామీణ ఉపాధి హామీ పని, ఫ్లిప్ కార్డ్ వంటి చిన్న చిన్న పనులు చేసుకుంటున్నారని ఉద్యోగ నోటిఫికేషన్ లేక రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అరకోర నోటిఫికేషన్ ఇచ్చినా దరఖాస్తు ఫీజులు అధికంగా వసూలు చేస్తూ యువతని ఇబ్బంది పెడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారత ప్రజాతంత్ర యువజన సమైఖ్య చేసే ఈ సర్వేలలో వచ్చిన సమస్యలపై పోరాటం చేసేందుకు కార్యచరణ తీసుకుందని ఆయన తెలిపారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థుల పరీక్షల్లో నిత్య%శీ% అవకతవకలు జరగటం దేశ అభ్భృద్ధికి ప్రమాదం అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల నాయకులూ పాశం రంగా, మురళి, గిరి,కార్తీక్ వినయ్ తరుణ్, తేజ్ దీప్, తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి చేతి పంపును ప్రారంభించిన ఎస్సై మధు బాబు




**బోనకల్,జూన్ 25,ప్రజాజ్యోతి:** మండలంలోని తూటికుంట్ల గ్రామంలో సిలువ బొమ్మ దగ్గర హెూప్ చారిటబుల సొసైటీ వారి సహకారంతో మంచి నీటి కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీళ్ళ బోరు మంగళవారం ఎస్సై మధు బాబు ప్రారంభించడం జరిగింది.అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల మంచినీటి సౌకర్యార్థం కోసం నూతనంగా చేతి పంపాను ఏర్పాటు చేసిన హెూప్ చారిటబుల్ ట్రస్ట్ వారిని ఎస్సై ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుళ్లూరు రమేష్,గ్రామ మాజీ సర్పంచ్ నోముల వెంకట నరసమ్మ పాస్టర్లు ఎర్నెస్ట్ పాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తుళ్లూరు లక్ష్మీ నరసయ్య తుళ్లూరు కొండలరావు పాపినేని వెంకటయ్య పాపినేని అప్పారావు పాపినేని వెంకట్రావు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మండల ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో ఉన్న వైన్ షాపును ఊరి అవతలకి మార్చాలి

**తిరుమలాయపాలెం, జూన్ 25, ప్రజా జ్యోతి :** బహుజన్ సమాజ్ పార్టీ పాలేరు అసెంబ్లీ సమీక్షా సమావేశం మంగళవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర సాహూ, బిఎస్పి ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి నాగేశ్వరరావు, మిరియాల నాగరాజు, విచ్చేసినారు. ఈ సందర్భంగా అసెంబ్లీ పరిధిలోని నాలుగు మండలాలలో గల ప్రజా సమస్యల గురించి చర్చించడం జరిగింది. ముఖ్యఅతిథి బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర సాహూ మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్ కు ఆనుకొని ఉన్న వైన్ షాప్ వల్ల విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందని ఈ కార్యక్రమంలో బిఎస్పీ జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు, అసెంబ్లీ అధ్యక్షులు మట్టే నాగేశ్వరరావు, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొమ్ము పూలే, అసెంబ్లీ నాయకులు వెంకటేష్, నాయకులు పాల్గొనడం జరిగింది.

# ప్రభుత్వాలు మారుతున్నా ప్రాజెక్టులు రావటం లేదు

### సీతారామతో సింగరేణి మండలానికి నీరు అందించాలి

### కండిషన్ లేకుండా రుణమాఫీ చేయాలి-సీపీఐ(ఎం)

**కారేపల్లి, జూన్ 25, ప్రజా జ్యోతి :** ప్రభుత్వాలు మారుతున్న సాగునీరు అందించే ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కావడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయ పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కార్యకర్తలకు తరగతులు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రాజెక్టులు పథకాల పేరుతో ప్రజలను మభ్యపుచ్చి అనంతరం ప్రాజెక్టు పక్కన పెట్టడం, పథకాలను అమలుపై కొర్రీలు పెట్టడం పాలకులకు పరిపాటయిందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టుతో సింగరేణి మండలాన్ని సస్యశ్యామలం చేయవచ్చుని, సీతారామ ప్రాజెక్టు నీటితో సింగరేణి మండలం అంతా సాగునీరు అందించేలా ప్రాజెక్టు కాలువ రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలలో ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి నేడు




కుటుంబానికి రెండు లక్షలంటూ కొర్రీలు పెట్టటం సరికాదన్నారు. బ్యాంకులలో రుణం తీసుకున్న ప్రతి రైతుకు రెండు లక్షల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతుకు కౌలు రైతుతో సహా రైతు భరోసారూ. 15వేలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర నాయకులు వజ్జా రామారావు, తలారి దేవప్రకాష్, బానోతు బన్సీలాల్, పండగ కొండయ్య, ముండ్ల ఏకాంబరం, కుర్సం శ్రీను, పాసిన్ని నాగేశ్వరరావు, అజ్మీర శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా పథకం పై రైతుల అభిప్రాయ సేకరణ





### వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**కూసుమంచి జూన్25 ప్రజా జ్యోతి :** కూసుమంచి మండలంలోని రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల పాల్గొన్నారు. ఇందులో భాగంగా రైతు భరోసా పథకం గురించి నేరుగా క్షేత్రస్థాయిలోని రైతుల అభిప్రాయాలను సేకరించి ఏ విధంగా రైతు భరోసా పథకం కింద ఆర్థిక చేయూతనిస్తే ఎక్కువ మంది రైతులకు లాభాలు చేకూరుతాయో, ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇస్తే ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూరుతుందో వంటి అంశాలను క్షేత్రస్థాయిలోని రైతులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడి అభిప్రాయాలను సేకరించడం జరిగింది. అదేవిధంగా ప్రతి రైతు వేదిక లో ఈ సమావేశానికి హాజరైనటువంటి రైతుల యొక్క అభిప్రాయాలను రాతపూర్వకంగా సేకరించి రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలని క్షేత్రస్థాయిలో పని చేస్తున్నటువంటి వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించడం జరిగింది. అనంతరం ప్రారంభమైనటువంటి స్పెషల్ క్రాప్ సర్వేను జాయింట్ కలెక్టర్, డీఏఓ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వానాకాలం లో వివిధ పంటల సాగు విధానం చీడపీడల నివారణ ఎరువుల యాజమాన్యం వంటి అంశాలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వారిచే వివిధ యూట్యూబ్ వీడియోలను ప్రదర్శించడంతోపాటుగా రైతులతో నేరుగా చర్చించి వారి సందేహాలను నివృత్తి చేయడం జరిగింది.ముఖ్యంగా ఈ వానాకాలం సాగుకు సంబంధించి తొలి దశలో ఖర్చులకు సంబంధించి విత్తన ఎరువులు పురుగుమందుల యజమాన్యం నిమిత్తం రైతుకు ఆర్థికంగా సహాయం అందించే విధంగా రైతు భరోసా కార్యక్రమం ద్వారా ఆర్థిక చేయూత అందించే ఉద్దేశంతో రాష్ట్రస్థాయిలో విధివిధానాలను రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు యెస్.విజయ చంద్ర, నాలుగు మండలాల ఏవోలు వాణి, అరుణకుమారి , సీతారాంరెడ్డి, నాగేశ్వరావు , 29 క్లష్టర్ల ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

# మోటమర్రి గ్రామంలో నీటి సమస్యపై అధికారుల చర్యలు

### త్రాగునీటి పైప్ లైన్లుకు మరమ్మతులు చేపట్టి నీటి పంపిణీ

### హర్షం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలు

**బోనకల్,జూన్25, ప్రజా జ్యోతి:** గత కొన్నిరోజులుగా గ్రామ ప్రజలకు త్రాగు నీటి సమస్య ఎదుర్కోవడంతో జరిగింది తాజాగా గ్రామాలకు నిత్యవసరమైన నీటిని పరిష్కరించడం కొసం స్వయాన ఎంపిడిఓ లకావత్ రాజు,ఎంపీఓ వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి స్వయంగా గ్రామంలో పర్యటించి పరిశీలించడం జరిగింది. గ్రామపంచాయతీ స్పెషల్ అధికారులు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని పగిలిపోయి,జామ్ అయినా పైపులను వెంటనే మరమ్మతులు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశారు. పగిలిన పైప్ లను అలాగే గ్రామంలో ఉన్న చేతి పంపులను పంచాయతీ సిబ్బంది పంచాయతీ సెక్రెటరీ చొరవతో వాటిని బాగు చేయడం జరిగింది.నీటి సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి గ్రామపంచాయతీలో ప్రజలకు నీటిని అందించేందుకు కృషి చేయడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం



చేశారు.త్వరలోనే మిగిలిన చేతిపంపులను ప్రజలకు అందుబాటులోకి




తీసుకొస్తామని పంచాయతీ సెక్రెటరీ జోగారావు,స్పెషల్ అధికారులు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది,మల్టీపర్పస్ వర్కర్స్ పాల్గొన్నారు.